క్లుప్తంగా

రేపు ప్రత్తిపాడులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రత్తిపాడు: స్థానిక లయన్స్‌క్లబ్ కమ్యూనిటీ హాలు ఆవరణలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్టు తహసీల్దార్ ఎస్.నరసింహరావు తెలిపారు. జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు హాజరవుతారని చెప్పారు. నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి మండలాలకు చెందిన ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందజేయవచ్చని తెలిపారు. నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ నరసింహారావు కోరారు.

విద్యార్థులకు స్టూడెంట్ కిట్ల పంపిణీ

కిర్లంపూడి: విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ తోట రవి అన్నారు. మండలంలోని వీరవరం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు శనివారం స్టూడెంట్ కిట్లను పంపిణీ చేశారు. ఎంపీపీ రవి, జెట్పీటీసీ సభ్యుడు తోట గాంధీ, సర్పంచ్ అంబటి బుజ్జమ్మ ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యార్థులకు కిట్లు అందజేశారు. కార్యక్రమంలో గొల్లపల్లి సూరిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంట మార్పిడితో అధిక దిగుబడులు



ముక్కొల్లులో కలుపు యాజమాన్యంపై శిక్షణ ఇస్తున్న ఏఓ అమృత

కిర్లంపూడి: రైతులు ఏటా ఒకే రకమైన పంటలు సాగుచేసే కన్నా పంట మార్పిడి చేయడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని మండల ఏఓ జోకా అమృత సూచించారు. మండలంలోని ముక్కొల్లులో శనివారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. రైతులు, వీపీఏలకు కలుపు యాజమాన్య పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. అనంతరం పొలంబడి క్షేత్రాన్ని పరిశీలించి కలుపు యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పొలంబడి, పొలం పిలుస్తోంది కార్యక్రమాల ద్వారా తక్కువ ఖర్చుతో ఆధునిక పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తుందన్నారు. చిరుధాన్యాలు సాగు చేసే రైతులకు సబ్సిడీపై విత్తనాలు అందజేస్తామని తెలిపారు.కలుపు, తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ జ్యోతుల రాంబాబు, దొడ్డ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఎ.కొత్తపల్లిలో చేతిపంపు ప్రారంభం



ఎ.కొత్తపల్లి ఎస్సీకాలనీలో చేతిపంపును ప్రారంభిస్తున్న నాసా ప్రతినిధులు

తొండంగి: మండలంలోని ఎ.కొత్తపల్లి ఎస్సీ కాలనీలో తుని నాసా సంస్థ ఆధ్వర్యంలో చేతిపంపు ఏర్పాటు చేశారు. స్థానిక ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు ఏర్పాటు చేసిన ఈ చేతిపంపును శనివారం తుని నాసా సంస్థ డైరెక్టర్ ఎస్.జ్యోతి, వైజర్ ప్రారంభించారు. నాసా సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలను స్థానికులు అభినందించారు. కార్యక్రమంలో నాసా మండల కమ్యూనిటీ ఆర్గనైజర్ ఆర్.హేమలత, డీపీఐఎస్ నాయకులు ఎస్.అబ్బులు, సీహెచ్ సత్యనారాయణ, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రహదారిపైనే మురుగు



నీలాద్రిరావుపేటలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు

గండేపల్లి: మండలంలోని నీలాద్రిరావుపేటలో ఆంధ్రాబ్యాంక్ ఎదురుగా బ్రిడ్జిని ఆనుకుని ఉన్న వీధిలో డ్రైనేజీ అధ్వానంగా మారింది. డ్రైన్ పూడుకుపోవడంతో మురుగునీరు రోడ్డుపైనే ప్రవహిస్తోంది. దీంతో ఆ మార్గంలో వెళ్లేందుకు స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు పడుతుండటంతో మురుగు నీరు నిల్వ ఉండిపోయి వ్యాధులు విజృంభించే అవకాశం ఉందని స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్యల తాండవం

- సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలు
- సాగునీటి కోసం అల్లాడుతున్న అన్నదాతలు
- ఆయకట్టు పరిధిలో ఇంకా ప్రారంభం కాని ఖరీఫ్ సాగు



తాండవ జలాశయంలో నీటి నిల్వలు

కోటనందూరు: రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన తాండవ జలాశయం ప్రస్తుతం సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. జలాశయంలో అవసరం మేర సాగునీరు లేకపోవడంతో ఆయకట్టు రైతులు నిస్సహాయ స్థితిలో ఆకాశం వైపు చూడాల్సి వస్తోంది. కాకినాడ–అనకాపల్లి జిల్లాల్లో 60 వేల ఎకరాలకు సాగునీరు అందించే ప్రాజెక్టులో నీరు నిల్వ ఉంచడంపై గత పాలకులెవరూ దృష్టి సారించ లేదు. ఫలితంగా నేడు రైతన్నకు సాగునీటి సమస్య తలెత్తింది. కాలం కనికరించక, సాగునీరు అందుబాటులో లేక ప్రస్తుతం రైతులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. జూలై గడిచిపోతున్నా నారుమడులు కూడా వేయలేని దుస్థితి నెలకొంది. జలాశయాన్ని సుదీర్ఘ కాలంగా అనేక సమస్యలు పట్టిపీడిస్తున్నాయి. ఆయా సమస్యలను పరిష్కరించకపోతే సాగునీటి ఇబ్బందులు ఎప్పటికీ తీరే పరిస్థితి లేదు. ప్రస్తుత పాలకులు తాండవ సమస్యలపై దృష్టి సారించాలని అన్నదాతలు కోరుతున్నారు.

51,460 ఎకరాల ఆయకట్టు

తాండవ జలాశయం పరిధిలో అనకాపల్లి జిల్లాలోని కోటవురట్ల, నర్సీపట్నం, నాతవరం మండలాల్లో 32,689 ఎకరాలు, కాకినాడ జిల్లాలో కోటనందూరు, తుని, రౌతులపూడి మండలాల్లో 18,776 ఎకరాల చొప్పున మొత్తం 51,460 ఎకరాల ఆయకట్టు అధికారికంగా ఉంది. అనధికారికంగా మరో 18 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ ఆయకట్టుకు 20 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న మేజర్, మైనర్ కాలువల ద్వారా సాగునీరు అందించాల్సి ఉంది.

వేధిస్తున్న అదనపు జలాల సమస్య

తాండవ జలాశయంలో అదనపు జలాలు సమకూర్చాలని గత మూడు దశాబ్దాలుగా రైతులు చేస్తున్న ఉద్యమానికి రాజకీయ నాయకుల ప్రోత్సాహం ఏమాత్రం లేదు. దీనికి తోడు ఉన్న ఆయకట్టు చాలదన్నట్లు కాలువల పొడవును పెంచుకుంటూ పోతున్నారు. తాండవ పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 4.4 టీఎంసీలు కాగా దీనిలో 0.4 టీఎంసీల నీరు డెడ్ స్టోరేజీగా ఉంటుంది. లెక్కల ప్రకారం ఒక టీఎంసీ నీరు 8 వేల ఎకరాల వరి, 12 వేల ఎకరాల ఆరుతడి పంటలకు సరిపోతుంది. ఈ లెక్కన తాండవ జలాశయం పూర్తిగా నిండితే కేవలం 32 వేల ఎకరాల వరి పంటకు మాత్రమే నీరు సరిపోతుంది. అధికారుల లెక్కల ప్రకారం 51,460 ఎకరాల తాండవ ఆయకట్టు ఉండగా వాస్తవంగా 69 వేల ఎకరాల వరకూ నీరు అందించాల్సి వస్తోంది. అంటే జలాశయం రెండుసార్లు నిండితే గాని ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరందించే పరిస్థితి లేదు.

భారీగా ఆక్రమణలు

జలాశయం అంతర్భాగంలో చాలా వరకూ ఆక్రమణలు చోటు చేసుకున్నాయి. నేతల ఒత్తిడి కారణంగా ఆక్రమణలను గుర్తించి తొలగించడంలో అధికారులు చొరవ చూపడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. కాలువ గట్లు సైతం భారీగా ఆక్రమణలకు గురైనట్లు రైతులు చెబుతున్నారు. ఈ ఆక్రమణలతో శివారు భూములకు సాగు నీరు అందడం లేదని టైలాండు ప్రాంత రైతులు వాపోతున్నారు.

జలాశయంలో తొలగించని పూడిక

జలాశయం ఏర్పడిన తరువాత పూడిక తీసే కార్యక్రమం ఇప్పటివరకూ జరగలేదు. వరద వచ్చిన ప్రతిసారి క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి భారీగా ఒండ్రుమట్టి జలాశయానికి వచ్చి చేరుతోంది. దీనికి తోడు జలాశయ అంతర్భాగంలో నీరులేని చోట సాగవుతున్న పంటల కారణంగా మట్టి కూడా వచ్చి చేరుతోంది. ఇలా అనేక సంవత్సరాలుగా జలాశయంలోకి భారీగా వచ్చి చేరిన పూడిక నీటి నిల్వల సామర్థ్యానికి గండి కొడుతోంది.

సిబ్బంది కొరతతో ఇక్కట్లు

జలాశయాన్ని సిబ్బంది కొరత పట్టి పీడిస్తోంది. జలాశయ పరిధిలోని ఐదు సెక్షన్లలో క్షేత్రస్థాయి సిబ్బంది లష్కర్లు, వర్క్ఇన్‌స్పెక్టర్ల కొరత అధికంగా ఉంది. ఈ కారణంగా నీటి నిర్వహణ సక్రమంగా జరగడం లేదని, దీనిపై అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా చర్యలు శూన్యమని రైతులు వాపోతున్నారు.

ఇసుక అక్రమాలతో కట్టడాలకు ముప్పు

తాండవ నదిలో ఇసుక అక్రమ రవాణాను నిరోధించడంలో అధికారులు ప్రేక్షకపాత్ర వహిస్తున్నారు. ఫలితంగా రైతులకు ప్రయోజనం చేకూర్చాల్సిన నదిలోని నీటి పంపిణీ కట్టడాలకు (గోయిన్లు) ముప్పు వాటిల్లుతుంది. గ్రోయిన్ల మరమ్మతులకు ఏటా రూ.కోట్లలో ఖర్చు చేస్తున్నా ఇసుక అక్రమాలతో కట్టడాలు నదిలో కొట్టుకుపోతున్నాయి.

పూడిక తొలగించాలి



తాండవ జలాశయంతో పాటు, కాలువల్లో అధికారులు పూడిక తొలగించకపోవడం వల్ల ఏటా సాగునీటి సమస్య తలెత్తుతోంది. పంట చివరిలో వర్షాభావ పరిస్థితులు తలెత్తడం పరిపాటిగా మారింది. అప్పుడు రైతులే స్వచ్ఛందంగా పూడిక తొలగించుకోవాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. టైలాండు రైతుల పరిస్థితి మరింత దయనీయం. ప్రాజెక్టు సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేయాలి.

– కరక అప్పలనాయుడు, రైతు, కేఈ చిన్నయ్యపాలెం

ప్రతిపాదనలు పంపాం



పూడిక తొలగింపు, గేట్ల మరమ్మతులు, సిబ్బంది నియామకానికి సంబంధించి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. ఈ ఏడాది ఖరీఫ్‌ను అధిగమించేందుకు తాత్కాలిక మరమ్మతులతో గేట్ల వద్ద లీకులు అరికట్టాం. పూర్తిస్థాయి ఆయకట్టుకు నీరందించేందుకు కృషి చేస్తున్నాం. నీటి పంపిణీకి రైతులు కూడా సహకరించాలి.

– అనురాధ, డీఈఈ, తాండవ జలాశయం

చిరుధాన్యాల సాగుతో లాభాలు



శంఖవరంలో చిరుధాన్యాల సాగుపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

శంఖవరం: చిరుధాన్యాల సాగుతో తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందవచ్చని జిల్లా ప్రకృతి వ్యవసాయ డైరెక్టర్ ఎలియాజర్ అన్నారు. మండలంలోని పెదమల్లాపురంలో శనివారం రిసోర్స్‌పర్సన్ దేవుళ్ల ఆధ్వర్యంలో రైతులకు చిరుధాన్యాల సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. చిరుధాన్యాలైన రాగి, జొన్న, సజ్జ, కొర్ర, సామ వంటి పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. అనంతరం రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఓ గాంధీ, సిబ్బంది అప్పలనాయుడు, రమణ, రైతులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

అన్నవరం: వాహనదారులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అన్నవరం ఎస్సై కిషోర్‌బాబు సూచించారు. స్థానిక డిగ్రీ కళాశాలలో శనివారం ప్రత్తిపాడు న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. పలువురు న్యాయవాదులు రోడ్డుపై ప్రయాణించేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షుడు ఆకాశపు మల్లేశ్వరరావు, న్యాయవాదులు బుగతా శివ, ఎ.దేవి, బత్తుల రవికుమార్, గౌరీ శంకర్, కె.సూర్యప్రకాష్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కొండల రావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు, బాలల హక్కులపై అవగాహన



ఎస్ఎస్‌వీ పురంలో మహిళలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు, కళాకారులు

తుని రూరల్: ఆడపిల్లల చదువు.. ఇంటికి వెలుగు అని ఐసీడీఎస్ సిబ్బంది పేర్కొన్నారు. మండలంలోని ఎస్ఎస్‌వీ పురంలో ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీలత ఆధ్వర్యంలో మహిళలు, బాలల హక్కులు, చట్టాలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ శ్రీలత మాట్లాడుతూ ఆడపిల్లలు, మగ పిల్లలు సమానమే అన్నారు. ఆడ పిల్లలను చదివించడంతో పాటు బాల్యవివాహాలు, బాలికల అక్రమ రవాణా, మహిళలపై లైంగిక వేధింపులను అరికడదామన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళలకు అన్యాయం జరిగితే ధైర్యంగా బయటకు వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. మహిళలు, బాలల హక్కులు, బాల కార్మిక వ్యవస్థలపై కళాకారులు బుర్రకథ ప్రదర్శించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, అంగన్‌వాడీలు, బాలింతలు, గర్భిణులు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

ఘనంగా వేగుళ్లమ్మ జాతర

గోకవరం: మండలంలోని గుమ్మళ్లదొడ్డిలో గ్రామదేవత వేగుళ్లమ్మ జాతర శనివారం ఘనంగా జరిగింది. జాతరను పురస్కరించుకుని గత మూడు రోజులుగా ఆలయం వద్ద వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం ఉదయం మహిళలు, ఆడపడుచులు అమ్మవారి బోనాలతో గ్రామంలో భారీ ఊరేగింపు నిర్వహించారు. బోనాలతో అమ్మవారి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాల్చిన బాణసంచా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సాయంత్రం ఆలయం వద్ద మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు.



వేగుళ్లమ్మకు బోనాలు సమర్పిస్తున్న మహిళలు

పర్యావరణ పరిరక్షణే ధ్యేయం



వి.కొత్తూరు కేజీబీవీలో మహావృక్షం చిత్రపటం వద్ద ఆసనాలు ప్రదర్శిస్తున్న విద్యార్థినులు



పప్పు దినుసులు, కూరగాయలతో ఏర్పాటు చేసిన స్థిరమైన ఆహార వ్యవస్థ

తుని రూరల్: పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా జీవించాలని వి.కొత్తూరు కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం ప్రిన్సిపాల్ అమృతవాణి అన్నారు. శిక్షా సప్తహ్ కార్యక్రమంలో భాగంగా కేజీబీవీ ఆవరణలో శనివారం విద్యార్థినులు ఏర్పాటు చేసిన వివిధ ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ప్రకృతికి అనుగుణంగా జీవించేందుకు అనుచరించాల్సిన విధానాలను, యోగాసనాలను, సహజసిద్ధమైన ఆహార పదార్థాలను ప్రదర్శించారు. వృక్షాలు వలన కలిగే ప్రయోజనాలు, చెట్లు నరికివేత వల్ల సంభవించే నష్టాలను, వివిధ రకాల కూరగాయలు, పప్పు దినుసులతో ఏర్పాటు చేసిన చిత్రాలను రూపొందించారు. ఉపాధ్యాయులు, విద్యార్థినులు, పాల్గొన్నారు.

మొక్కలు నాటిన విద్యార్థులు



ఏలేశ్వరంలో మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఏలేశ్వరం: పట్టణంలోని ప్రభుత్వోన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులు మొక్కలు నాటారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా హెచ్ఎం లక్ష్మీతులసి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థులు మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణను బాధ్యతగా తీసుకోవాలన్నారు. ప్రజలకు మొక్కల పెంపకంపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకాన్ని అలవాటు చేసుకోవాలి

గోకవరం: విద్యార్థి దశ నుంచే మొక్కల పెంపకాన్ని అలవాటు చేసుకోవాలని రంపయర్రంపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్ఎం జి.ప్రమీలారాణి, ఎస్‌జీసీ జిల్లా కోఆర్డినేటర్ జి.ఆంజనేయులు సూచించారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంలో పాఠశాల విద్యాశాఖ, సమగ్రశిక్ష, నేషన్ గ్రీన్‌కోర్ ఆధ్వర్యంలో శనివారం పాఠశాలల్లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. సుమారు 180 మొక్కలను పాఠశాల ఆవరణలో నాటారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



రంపయర్రంపాలెం పాఠశాలలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు, తల్లులు

పరిశుభ్రత.. అందరి బాధ్యత

తుని: పరిసరాల పరిశుభ్రతను ప్రతిఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎ. వెంకటరావు సూచించారు. స్వచ్ఛత వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక 11, 14 వార్డుల్లో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. పార్కు, రాజా గ్రౌండులో మున్సిపల్ అధికారులే స్వయంగా పిచ్చి మొక్కలను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం పట్టణంలో పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ చేశారు. రాజా గ్రౌండ్స్‌లో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. కార్యక్రమంలో డీఈ ప్రకాశరావు, ఏఈ ప్రసన్న, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



తునిలో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేస్తున్న మున్సిపల్ అధికారులు

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు



పర్యావరణ వేత్త అంకారావును సత్కరిస్తున్న ఆదర్శ ఫార్మసీ కళాశాల యాజమాన్యం

గోకవరం: ప్లాస్టిక్ వినియోగంతో మానవాళికి, పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని ప్రముఖ పర్యావరణ వేత్త కొమిర అంకారావు అన్నారు. ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మండలంలోని కొత్తపల్లి ఆదర్శ ఫార్మసీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ త్రినాథరావు అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అంకారావు మాట్లాడుతూ మితిమీరిన ప్లాస్టిక్ వినియోగంతో మానవాళికి, పశుపక్షాదులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, మొక్కలను విరివిగా పెంచాలని సూచించారు. రావి చెట్టు, వేప చెట్టు, ఇంట్లో ఉండవలసిన నల్ల ఉమ్మెత్త, తులసి మొక్కల ఉపయోగాలను వివరించారు. అనంతరం అంకారావును కళాశాల చైర్మన్ పి.కనకరాజు, సెక్రటరీ నాగమణి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కళాశాల డైరెక్టర్లు సంతోష్, ప్రవల్లిక, కోఆర్డినేటర్ శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

గవరయ్య కుటుంబానికి న్యాయం చేయాలి



కత్తిపూడిలో విచారణ చేస్తున్న పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి

శంఖవరం: ఆర్థిక ఇబ్బందులతో అసువులు బాసిన మోర్త గవరయ్య కుటుంబానికి న్యాయం చేయాలని ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ ఎం.విక్టర్‌ప్రసాద్ డిమాండ్ చేశారు. మండలంలోని కత్తిపూడిలో పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి నిర్వహించిన విచారణలో విక్టర్ ప్రసాద్ పాల్గొని మాట్లాడారు. మోర్త గవరయ్యకు కత్తిపూడి శివారులో 5.6 ఎకరాల భూమి ఉందని, ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ఆ భూమిని మారిని వాసుదేవ్ అనే వ్యక్తికి తనఖా పెట్టాడన్నారు. కొద్దిరోజుల క్రితం గవరయ్య మృతి చెందడంతో డబ్బులు వడ్డీతో సహ చెల్లిస్తానని, భూమిని అప్పగించాలని గవరయ్య కుమారుడు ప్రదీప్ వాసుదేవ్‌ను కోరారు. ఈ భూమికి మీకు సంబంధం లేదని వాసుదేవ్ చెప్పడంతో గవరయ్య కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో భాగంగా డీఎస్పీ విచారణ చేపట్టారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు సీఐ శేఖర్‌బాబు, అన్నవరం ఎస్సై కిషోర్, తహసీల్దార్ రాజకుమారి, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలు రాకుండా చర్యలు

కొత్తపల్లి: గ్రామాల్లో ప్రజలకు తాగునీటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకుంటున్నట్టు పంచాయతీ రాజ్ డైరెక్టర్ ఎంవీఆర్ కృష్ణతేజ తెలిపారు. మండలంలో శనివారం ఆయన పర్యటించారు. వాకతిప్ప శివారు నాగులాపల్లి ఏరియా రక్షిత మంచినీటి పథకాన్ని పరిశీలించారు. వేసవిలో తాగునీటి సమస్య రాకుండా నూతనంగా ఏర్పాటు చేయనున్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు చెరువు సమస్యను అధికారులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. అమరవల్లిలో రైతు పండిస్తున్న జామ తోట, పంచాయతీ స్థలంలో వేసిన కొబ్బరితోటను ఆయన పరిశీలించారు. కొత్తమూలపేటలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపముఖ్యమంత్రి కె.పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలో పర్యటించినట్టు తెలిపారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల ఏర్పాటుకు రైతులు పంచాయతీల నుంచి అన్ని అనుమతులు పొందాలన్నారు. ఈ స్టోరేజ్ ట్యాంకును జల్ జీవన్ మిషన్‌లో నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ శ్రీరామచంద్రమూర్తి, డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి, డీఎల్‌డీఓ నారాయణమూర్తి, ఎంపీడీఓ వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.



తాగునీటి పథకం నమూనాను పరిశీలిస్తున్న కృష్ణతేజ

ఫొటోగ్రాఫర్ల యూనియన్‌కు స్థలం కేటాయించాలి

కొత్తపల్లి: మండల పర్యటనకు వచ్చిన పంచాయితీరాజ్ డైరెక్టర్ కృష్ణతేజను శనివారం మండల ఫొటో గ్రాఫర్ యూనియన్ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. మండల ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం మాజీ కార్యదర్శి పుచ్చల బంగారుబాబి, పలువురు ఫొటో అండ్ వీడియో గ్రాఫర్లు పాల్గొన్నారు.